సాక్షి
ఖమ్మం
శనివారం । 16 । సెప్టెంబర్ । 2023



పెసర.. దక్కని మద్దతు ధర

వాతావరణ పరిస్థితులతో పెసర సాగుతో పాటు దిగుబడి పడిపోగా, మద్దతు ధర లభించక రైతులు మరింత నష్టపోతున్నారు. IVలో



వైద్యవృత్తి మహోన్నతమైనది

ఖమ్మంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రారంభం కాగా, ప్రిన్సిపాల్, విద్యార్థులు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. IIలో

గరిష్టం / కనిష్టం
34° / 25°

వాతావరణం

జిల్లాలోని పలు ప్రాంతాల్లో శనివారం చిరుజల్లులు మొదలు ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

మంత్రిని కలిసిన అదనపు కలెక్టర్



మంత్రికి పుష్పగుచ్ఛం ఇస్తున్న అదనపు కలెక్టర్

ఖమ్మం సహకారనగర్: జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు)గా ఇటీవల బి.సత్యప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా ఆయన శుక్రవారం క్యాంపు కార్యాలయంలో మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

మానవ అక్రమ రవాణాను అరికడదాం



మాట్లాడుతున్న న్యాయమూర్తి అబ్దుల్ జావీద్‌పాషా

ఖమ్మంలీగల్: మహిళల అక్రమ రవాణా, తదితర అంశాల్లో అప్రమత్తంగా ఉంటూ అరికట్టేందుకు అందరూ కృషి చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ న్యాయమూర్తి మహ్మద్ అబ్దుల్ జావీద్‌పాషా సూచించారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. అక్రమ రవాణా బాధితులకు ఓటరు గుర్తింపు కార్డులు, రేషన్‌కార్డులు వచ్చేలా అధికారులతో చర్చిస్తామని తెలిపారు. అలాగే, మహిళా శిశు సంక్షేమ శాఖ ద్వారా కుట్టు, ఎంబ్రాయిడరీ తదితర అంశాల్లో శిక్షణ ఇప్పిస్తామని, అర్హులకు ప్రభుత్వ పథకాలు అందకపోతే తమ తమ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో జాగృతి సంస్థ బాధ్యులు కుముదిని, కె.కొండల్‌రావు, మాధవి తదితరులు పాల్గొన్నారు.

రైళ్ల రద్దు మరికొన్ని రోజులు..

ఖమ్మం మామిళ్లగూడెం: ట్రాక్ మరమ్మతుల కారణంగా పలు ప్యాసింజర్ రైళ్లను ఈనెల 17వ తేదీ వరకు రద్దు చేసిన రైల్వే శాఖ... ఈ నిర్ణయం 24వరకు అమల్లో ఉంటుందని వెల్లడించింది. పనులు పూర్తికాకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సీసీఐ జాఫర్ తెలిపారు. విజయవాడ నుండి ఖమ్మం మీదుగా నడిచే డోర్నకల్ - విజయవాడ(07755), విజయవాడ - డోర్నకల్(07756), భద్రాచలం రోడ్ - విజయవాడ(07278), విజయవాడ - భద్రాచలం రోడ్(07279) రైళ్లు ఈనెల 24వరకు నడవవనే విషయాన్ని ప్రయాణికులు గమనించాలని కోరారు.

కేంద్ర బృందం పరిశీలన



వివరాలు సేకరిస్తున్న కేంద్ర బృందం సభ్యులు

కామేపల్లి: కామేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి కొమ్మినేపల్లి పల్లె దవాఖానాను ఎన్‌క్వాస్ బృందం శుక్రవారం సందర్శించింది. బృందం సభ్యులు ఎంఎస్.రీటారాణి, వైద్యురాలు అమూల్య రతన్, మోహన్నత దవాఖానాలో తనిఖీ చేసి రికార్డులు, రోజువారీ ఓపీ, వ్యాక్సినేషన్, ఇతర అంశాలపై ఆరా తీశారు. ఈసందర్భంగా పీహెచ్‌సీ వైద్యులు ఇక్కడ అందిస్తున్న సేవలు, సౌకర్యాలను వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు ఎన్.చందన, శిరీష, ఉస్మాన్, ఉద్యోగులు సుధారాణి, దూప్‌సింగ్, రేణుకారాణి, నవత తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే వ్యాధులు దూరం



రోడ్లు ఊడుస్తున్న డీఆర్‌డీఓ, తదితరులు

రఘునాథపాలెం: ప్రతీఒక్కరు ఇంట్లోనే కాక పరిసరాల పరిశుభ్రత పాటించాలని.. తద్వారా వ్యాధులు దరిచేరవని డీఆర్‌డీఓ విద్యాచందన అన్నారు. వచ్చేనెల 2న జరిగే జాతీయ స్వచ్ఛతా దినోత్సవంలో భాగంగా మండలంలోని రేగుల చెలకలో శుక్రవారం స్వచ్ఛతా హీ సేవా పక్షోత్సవాలను ప్రారంభించారు. ఈసందర్భంగా ర్యాలీ నిర్వహించడంతో పాటు శ్రమదానం చేశారు. ప్రజాప్రతినిధులు, ఉద్యోగులతో కలిసి డీఆర్‌డీఓ రోడ్లపై చెత్తాచెదారం తొలగించి మాట్లాడారు. సర్పంచ్ కె.రామారావు, పంచాయతీ కార్యదర్శి సంగీతతో పాటు నున్నా వెంకటేశ్వర్లు, నున్నా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ముహూర్తం ఖరారైంది..



ఠాక్రేను సన్మానించిన తుమ్మల నాగేశ్వరరావు, పక్కన రేవంత్, భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల యుగేందర్, సాధు రమేష్‌రెడ్డి తదితరులు

నేడు కాంగ్రెస్‌లో చేరనున్న తుమ్మల

- సోనియాగాంధీ సమక్షాన పార్టీలో చేరిక
- మాజీ మంత్రి ఇంటికి వెళ్లి ఆహ్వానించిన ఠాక్రే
- చర్చల్లో పాల్గొన్న రేవంత్‌రెడ్డి, భట్టి, పొంగులేటి
- త్వరలోనే ఖమ్మం లేదా పాలేరులో సభ

సాక్షిప్రతినిధి, ఖమ్మం: మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ నేత తుమ్మల నాగేశ్వరరావు కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు ముహూర్తం కుదిరింది. పార్టీ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లి ఖార్జునఖర్గే సమక్షాన శనివారం ఆయన కాంగ్రెస్ కండువా కప్పుకోనున్నారు. రెండు రోజుల పాటు సీడబ్ల్యూసీ సమావేశాలు హైదరాబాద్‌లో జరగనుండగా, 17వ తేదీన తుక్కుగూడలో విజయభేరి సభ నిర్వహిస్తున్నారు. అయితే సభకు ముందుగానే శనివారం తుమ్మల పార్టీలో చేరనున్నారు. అధిష్టానం ఆదేశాల మేరకు ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మాణిక్‌రావ్ ఠాక్రే, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, సీఎల్పీ నేత మల్లు భట్టివిక్రమార్క, ప్రచార కమిటీ కోచైర్మన్ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి శుక్రవారం హైదరాబాద్‌లోని తుమ్మల ఇంటికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలిసి పార్టీలోకి ఆహ్వానించారు.

ఉప ఎన్నికలో విజయం.. గత ఎన్నికలో పరాభవం

ఉమ్మడి జిల్లాలో రాజకీయ ఉద్దండుడిగా పేరున్న తుమ్మల నాగేశ్వరరావు 2016లో పాలేరు ఉప ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థిగా భారీ మెజార్టీతో విజయం సాధించారు. ఆతర్వాత 2018 ఎన్నికల్లో ఓటమి చవిచూశారు. అనంతర రాజకీయ పరిణామాల్లో ఈ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ తరఫున గెలిచిన ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి బీఆర్‌ఎస్‌లో చేరారు. దీంతో పాలేరులో తుమ్మల రాజకీయ భవితవ్యంపై నీలినీడలు కమ్ముకుంటూ వచ్చాయి. నియోజకవర్గంలో తన అనుచరుల ఆధ్వర్యాన కాక పార్టీ పరంగా జరిగిన కార్యక్రమాలన్నింటికీ ఆయన హాజరయ్యారు. నియోజకవర్గవ్యాప్తంగా తుమ్మల, కందాల వర్గీయులు ఢీ అంటే ఢీ అన్నట్లుగా కార్యక్రమాల్లో మమేకమయ్యారు. తరచుగా రెండు వర్గాల మధ్య ఘర్షణలు చోటు చేసుకొని కేసుల వరకు వెళ్లాయి. ఈక్రమంలో తమకే టికెట్ వస్తుందని ఇద్దరు నేతలు ధీమాగా ఉండగా... కందాలకే టికెట్ ఇవ్వడంతో తుమ్మలతో పాటు ఆయన వర్గం నైరాశ్యంలోకి వెళ్లింది. పార్టీని అంటి పెట్టుకొని, టికెట్ వస్తుందన్న ధీమాతో ఉన్న నాగేశ్వరరావును పార్టీ పక్కన పెట్టడాన్ని అనుచరులు జీర్ణించుకోలేకపోవడంతో పార్టీ మార్పునకు అడుగులు పడ్డాయి.

తిరుగుబావుటా ఎగురేసి..

తుమ్మలకు పాలేరు టికెట్ రాకపోవడంతో ఆయన అనుచరులు ఆగ్రహంతో ఊగిపోయారు. బీఆర్‌ఎస్ టికెట్ల ప్రకటన తర్వాత ఆయన గత నెల 25న జిల్లాకు వచ్చినప్పుడు అనుచరులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 'ప్రజల ఆత్మగౌరవం.. అవసరం కోసం ఈ ఎన్నికల్లో పోటీ చేస్తా, మీ అండ, బలగం ఉన్నంత కాలం దేనికీ తలవంచను, నా రాజకీయ జీవితం మీ చేతుల్లో ఉంది.' అని చెప్పారు. దీంతో తుమ్మల ఏ పార్టీలోకి వెళ్తారనే చర్చ సాగింది.

వరుసగా నేతల కలయిక

ఇటీవల రాజధానిలో తుమ్మల ఇంటికి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వెళ్లి కాంగ్రెస్‌లో చేరాలని ఆహ్వానించారు. అలాగే ఖమ్మంలోని ఆయన ఇంటికి పార్టీ ప్రచార కమిటీ కోచైర్మన్ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెళ్లగా, గండుగులపల్లికి భట్టి వెళ్లి చర్చించారు. ఇక శుక్రవారం పార్టీ పెద్దలు ఠాక్రేతో పాటు రేవంత్‌రెడ్డి, భట్టి, పొంగులేటి హైదరాబాద్‌లోని తుమ్మల ఇంటికి వెళ్లి పార్టీలోకి ఆహ్వానించారు. కొద్దిరోజుల పాటు ఆయన స్వగ్రామమైన దమ్మపేట మండలం గండుగులపల్లికి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అనుచరులు వెళ్లి కాంగ్రెస్‌లో చేరితేనే భవిష్యత్ ఉంటుందని చెప్పడంతో తుమ్మల అటే మొగ్గు చూపారు. అయితే, తుమ్మల కాంగ్రెస్‌లోకి చేరితే రాజకీయ బలాబలాలు ఎలా ఉంటాయి, ఉమ్మడి జిల్లాలో సమీకరణాలు ఎలా మారతాయనే అంశంపై జోరుగా చర్చ సాగుతోంది.

ముందు తుమ్మల ఒక్కరే..

రెండు రోజుల పాటు రాజధానిలో జరిగే సీడబ్ల్యూసీ సమావేశాల్లో విరామ సమయంలో రాష్ట్ర వ్యాప్తంగా పలువురు నేతలను కాంగ్రెస్‌లో చేర్చుకునేందుకు అధిష్టానం నిర్ణయించినట్లు తెలిసింది. ఇందులో భాగంగా తుమ్మల కూడా పార్టీ కండువా కప్పుకోనున్నారు. శనివారం ఈ కార్యక్రమం పూర్తయ్యాక ఈనెల 17న తుక్కుగూడలో జరిగే విజయభేరి సభకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆయన అనుచరులను తరలించేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇక త్వరలోనే ఖమ్మం లేదా పాలేరులో భారీ సభ నిర్వహించి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని ఆహ్వానిస్తున్నట్లు తెలిసింది. ఆ సభలోనే తుమ్మల అనుచరులు కాంగ్రెస్‌లో చేరనున్నట్లు సమాచారం. ఈ విషయమై ఇప్పటికే అనుచరగణానికి సమాచారం ఇచ్చినట్లు తెలిసింది.

వైద్య విద్యలో నవశకం



ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రసంగాన్ని వింటున్న మంత్రి, కలెక్టర్ గౌతమ్ తదితరులు

- ఈ ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుంది..
- మెడికల్ కాలేజీ ప్రారంభ సమావేశంలో మంత్రి పువ్వాడ

ఖమ్మం వైద్యవిభాగం: తెలంగాణలో వైద్య రంగానికి పెద్దపీట వేయడం ద్వారా సీఎం కేసీఆర్ నవశకానికి నాంది పలికారని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. రాష్ట్రంలోని తొమ్మిది ప్రభుత్వ మెడికల్ల కాలేజీలను సీఎం కేసీఆర్ హైదరాబాద్ వర్చువల్ పద్ధతిలో శుక్రవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఖమ్మంలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీలో జరిగిన సమావేశంలో మంత్రి పువ్వాడ, కలెక్టర్ వీ.పీ.గౌతమ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ఒకేరోజు తొమ్మిది ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లో తరగతులు ప్రారంభించడం ద్వారా సీఎం కేసీఆర్ చరిత్ర సృష్టించారని తెలిపారు. మెడికల్ కళాశాల ఏర్పాటుతో జిల్లాకు కలిగే ప్రయోజనాలను, అనుబంధ ఆస్పత్రుల్లో అందే సేవలపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. కాగా, మెడికల్ కళాశాల భవనాల నిర్మాణానికి ఇప్పటికే ప్రభుత్వం రూ.166 కోట్లు మంజూరు చేసిందని మంత్రి తెలిపారు. ప్రస్తుతంపాత కలెక్టరేట్, ఇతర కార్యాలయ భవనాలను రూ.8.5కోట్లతో కల్పించి అన్ని సౌకర్యాలు కల్పించామని చెప్పారు. విద్యార్థులు అందుబాటులోకి వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ పట్టుదల, అంకితభావంతో కోర్సు పూర్తి చేసి తల్లిదండ్రుల కలలు నెరవేర్చాలని సూచించారు. కాగా, ఖమ్మం జిల్లాకు ప్రభుత్వ మెడికల్ కాలేజీని మంజూరు చేయడంపై ముఖ్యమంత్రి కేసీఆర్‌కు మంత్రి పువ్వాడ జిల్లా ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్లు లింగాల కమలరాజ్, కొండబాల కోటేశ్వరరావు, కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.రాజేశ్వరరావు, డీఎంహెచ్‌ఓ బి.మాలతి, జిల్లా ప్రధాన ఆస్పత్రి సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, కార్పొరేటర్ కర్నాటి కృష్ణ, కళాశాల ప్రొఫెసర్లు, టీఎస్‌ఎంఐడీసీ ఈఈ ఉమామహేశ్వరరావు, డీఈ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'ఆయిల్‌పామ్' లక్ష్యాన్ని సాధించాలి

అధికారులతో సమీక్షలో కలెక్టర్ గౌతమ్



మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్, పక్కన అదనపు కలెక్టర్ మధుసూదన్, అధికారులు

ఖమ్మం సహకారనగర్: జిల్లాలో ఆయిల్ ఫామ్ నిర్దేశిత లక్ష్యాన్ని సాధించాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ అన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఆయన అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఈ ఏడాది 11,800 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేయాలనేది లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఈ పంట సాగుతో లాభాలపై రైతులకు అవగాహన కల్పించడమే కాక సబ్సిడీలను వివరించాలని సూచించారు.

దరఖాస్తులు పెండింగ్ ఉండొద్దు

రెవెన్యూ సంబంధిత అంశాలపై దరఖాస్తులు పెండింగ్‌లో లేకుండా తహసీల్దార్లు పరిష్కరించాలని కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం జీఓ 58, 59 అమలు, ధరణి దరఖాస్తులపై సమీక్షించిన కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాల అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈసమావేశాల్లో ఈసమావేశంలో అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి అనసూర్య, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సరిత, సర్వేల్యాండ్ రికార్డ్స్ ఏడీ శ్రీనివాస్, ఆర్డీఓలు గణేష్, అశోక్ చక్రవర్తి, ఎస్‌డీసీ రాజేశ్వరి, కలెక్టరేట్ ఏఓ అరుణ తదితరులు పాల్గొన్నారు.

అందరూ భాగస్వామ్యం కావాలి

పర్యావరణ పరిరక్షణలో ప్రజలందరూ భాగస్వామ్యం కావాలని, ఈ విషయమై అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు అవగాహన కల్పించాలని కలెక్టర్ గౌతమ్ పిలుపునిచ్చారు. వినాయక చవితి సందర్భంగా మట్టి విగ్రహాలను ప్రతిష్ఠించాలని కోరుతూ కాలుష్య నియంత్రణ మండలి రూపొందించిన పోస్టర్లను జిల్లా పర్యావరణ అధికారి బి.రవీందర్‌తో కలిసి కలెక్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. కాగా, ఈనెల 18న జిల్లా కేంద్రంలోని ప్రధాన కూడళ్ల వద్ద మట్టి ప్రతిమలను పంపిణీ చేస్తారని తెలిపారు.

అంగన్‌వాడీల సమస్యలు పట్టవా?



ర్యాలీలో పాల్గొన్న అంగన్‌వాడీలు, నాయకులు

ఖమ్మంరాపర్తినగర్: అంగన్‌వాడీ ఉద్యోగులు సమస్యల పరిష్కారం కోసం ఐదు రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం గర్హనీయమని కార్మిక సంఘాల నాయకులు పేర్కొన్నారు. ఇకనైనా చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించకపోతే ప్రభుత్వానికి పతనం తప్పదని హెచ్చరించారు. ఈ సందర్భంగా శుక్రవారం జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పెవిలియన్ గ్రౌండ్‌లో నిర్వహించిన సభలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కల్యాణం వెంకటేశ్వరరావు, ఏఐటీయూసీ రాష్ట్ర నాయకుడు సింగు నరసింహారావు మాట్లాడుతూ అంగన్‌వాడీ ఉద్యోగులు రాష్ట్రంలో పేదలకు సేవలు అందిస్తున్నారన్నారు. అయినా వారికి ఇతర రాష్ట్రాల్లో కంటే తక్కువ సౌకర్యాలు కల్పిస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘాలు, అంగన్‌వాడీల యూనియన్ నాయకులు తుమ్మ విష్ణువర్ధన్, గాదె లక్ష్మీనారాయణ, సీతామహాలక్ష్మి, బి.కోటేశ్వరి, సుధారాణి, నాగమణి, పాపారాణి, విజయకుమారి, పద్మజ, లక్ష్మీమణి తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మంలోని పరీక్ష కేంద్రం వద్ద అభ్యర్థులు



ప్రశాంతంగా టెట్..



దివ్యాంగుడిని ఎత్తుకుని తీసుకెళ్తున్న కేంద్రం ఉద్యోగి

కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్ గౌతమ్

ఖమ్మం సహకారనగర్: టీచర్స్ ఎలిజిబిలిటీ టెస్టు (టెట్) శుక్రవారం జిల్లాలో ప్రశాంతంగా జరిగింది. ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో పరీక్షలు నిర్వహించారు. ఉదయం 54 పరీక్షా కేంద్రాల్లో 12,923మంది అభ్యర్థులకు 10,465మంది(80.98శాతం) హాజరయ్యారు. అలాగే, మధ్యాహ్నం పరీక్ష 45 కేంద్రాల్లో జరగగా, 10,480 మంది అభ్యర్థులకు గాను 9,528 మంది(90.92శాతం) హాజరయ్యారని అధికారులు తెలిపారు.

ముందుగానే కేంద్రాలకు..

టెట్ కేంద్రాలకు అభ్యర్థులు ముందుగానే హాజరయ్యారు. నిమిషం నిబంధన అమల్లో ఉంటుందని ప్రకటించడంతో జాగ్రత్తలు తీసుకున్నారు. ఖమ్మంలోని ఓ పరీక్ష కేంద్రానికి వెళ్లేందుకు దివ్యాంగుడైన అభ్యర్థి ఇబ్బంది పడుతుండగా సిబ్బంది సహకరించారు. అలాగే, ఇంకో దివ్యాంగురాలిని ఆమె బంధువు భుజంపై ఎత్తుకుని తీసుకొచ్చాడు. కాగా, జిల్లా కేంద్రంలోని పలు పరీక్ష కేంద్రాలను కలెక్టర్ వీ.పీ.గౌతమ్, పరీక్షల రాష్ట్ర అబ్జర్వర్, డైట్ కళాశాల ప్రిన్సిపాల్ సామినేని సత్యనారాయణ, అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, డీఈఓ సోమశేఖర శర్మ తనిఖీ చేశారు.

'అసెస్‌మెంట్' పన్ను చెల్లింపు కోసమే..

- తప్పుడు పద్ధతిలో నంబర్లు పొందితే రద్దు చేస్తాం
- కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి



మట్టి విగ్రహాలపై అవగాహన పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కమిషనర్ ఆదర్శ్, అధికారులు

ఖమ్మంమయూరిసెంటర్: ఖాళీ స్థలాలు, భవనాలకు ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ ద్వారా కేటాయించే అసెస్‌మెంట్ నంబర్లు కేవలం పన్నులు చెల్లింపు కోసమేనని.. వీటితో స్థలాలు, భవనాలపై హక్కు లభించదని కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి స్పష్టం చేశారు. కేఎంసీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇంటి నంబర్ల కేటాయింపుపై ఇటీవల వస్తున్న ఆరోపణలపై విచారణ చేశామన్నారు. ఈ ఏడాది జనవరి నుండి ఇప్పటివరకు 1,861 దరఖాస్తులు రాగా. తప్పుడు ధ్రువపత్రాలు సమర్పించినవి 36, ప్రభుత్వ స్థలాలకు సంబంధించినవి ఉండగా... ఇందులో తొమ్మిది దరఖాస్తులపై కేసులు నమోదు చేశామని చెప్పారు. అలాగే, ప్రభుత్వ స్థలాలకు సంబంధించి వాటిని రిజిస్ట్రేషన్ చేయొద్దని సబ్ రిజిస్ట్రార్‌కు లేఖ రాసినట్లు వెల్లడించారు. అంతేకాక కేఎంసీలో అసెస్‌మెంట్ల నంబర్లు జారీ చేసిన సిబ్బందిని ఇతర విభాగాలకు బదిలీ చేశామని తెలిపారు. అసెస్‌మెంట్లను ఎప్పుడైనా పరిశీలించి రద్దు చేసే అధికారం కేఎంసీకి ఉంటుందని, ఈ విషయాన్ని గుర్తించి తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు చేయొద్దని కమిషనర్ సూచించారు.

ఓటు హక్కు నమోదుకు 19వరకు అవకాశం

అర్హులైన యువత ఓటర్లుగా నమోదు చేసుకునేందుకు ఈనెల 19వ తేదీ వరకు అవకాశముందని కమిషనర్ ఆదర్శ్ సురభి తెలిపారు. ఈమేరకు యువత ఫామ్–6 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, ఇప్పటికే ఓటుహక్కు ఉన్న వారు చిరునామా మార్పు కోసం దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. ఖమ్మం నియోజవకర్గం పరిధిలో కొత్తగా 8,092, తొలగింపు కోసం 6,659, చిరునామ మార్పు కోసం 7,864 దరఖాస్తులు వచ్చాయని పేర్కొన్నారు.

మట్టి విగ్రహాలను పూజించండి..

వినాయక చవితి సందర్భంగా మట్టితో చేసిన విగ్రహాలనే పూజించాలని కమిషనర్ ఆదర్శ్ పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ద్వారా ఇప్పటికే అవగాహన కల్పిస్తుండగా, కేఎంసీ ఆధ్వర్యాన ఈ ఏడాది 7వేల మట్టి విగ్రహాలను 60 డివిజన్లలో పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. ఇక కేఎంసీ పరిధిలో ఇప్పటివరకు 43 డెంగీ కేసులు నమోదైనందున, నివారణకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఈ సమావేశంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారి రవీందర్, ఏఎంసీ సత్యనారాయణరెడ్డి, ఎన్నికల డీటీ సంపత్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేయండి



ఎస్‌ఈని సన్మానిస్తున్న అధికారులు

ఖమ్మం అర్బన్: పెండింగ్ పనులన్నీ త్వరగా పూర్తి చేయించడమే కాక కొత్త పనులకు అంచనాలు చేపట్టాలని జల వనరుల శాఖ ఎస్‌ఈ నర్సింగరావు అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో శుక్రవారం ఆయన సమావేశమై పనుల పురోగతిపై సమీక్షించారు. పెండింగ్ పనులపై ప్రత్యేక దృష్టి సారించి త్వరగా పూర్తయ్యేలా చూడాలని తెలిపారు. అనంతరం ఇంజనీర్స్ డే సందర్భంగా మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పించగా, ఎస్‌ఈ నర్సింగరావును అధికారులు సన్మానించారు. ఈసమావేశంలో అధికారులు అనన్య, వెంకటేశ్వరరావు, బాబురావు, డీఎస్‌ఈ వెంకట్రాం తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు జిల్లాలో మంత్రి పువ్వాడ పర్యటన

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ శనివారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 10 గంటలకు చింతకాని మండలం గాంధీనగర్‌లో గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. ఆతర్వాత పాతర్లపాడు, నేరడ, కొదుమూరుల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను మంత్రి ప్రారంభిస్తారు.

సీఎం అల్పాహార పథకంపై హర్షం
సంక్షేమంలో దేశానికే ఆదర్శంగా నిలిచిన సీఎం కేసీఆర్ ప్రభుత్వం మరో వినూత్న పథకానికి శ్రీకారం చుట్టిందని మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు. దసరా కానుకగా వచ్చేనెల 24నుంచి ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు అల్పాహారం అందించనున్నట్లు ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఇప్పటికే మన ఊరు – మన బడి ద్వారా పాఠశాలల్లో సౌకర్యాలు సమకూరగా, ఇప్పుడు అల్పాహార పథకంతో విద్యార్థులకు మేలు జరుగుతుందని తెలిపారు.

వినాయక మండపాలకు విద్యుత్ అనుమతులు

– మార్గదర్శకాలు జారీ చేసిన ఎన్పీడీసీఎల్

ఖమ్మంవ్యవసాయం: వినాయక మండపాల ఏర్పాటుకకు సిద్ధమవుతున్న నిర్వాహకులు విద్యుత్ వినియోగం కోసం అనుమతి తీసుకోవాలని ఎన్పీడీసీఎల్ అధికారులు సూచించారు. ఈసందర్భంగా నిర్వాహకులు సంబంధిత ఏఈకి దరఖాస్తు చేసుకుని లోడ్‌కు అనుగుణంగా ఫీజు చెల్లించి అనుమతి తీసుకోవాలని తెలిపారు. ఈమేరకు 1,000 వాట్స్ వరకు రూ.1,560, 1,000 నుంచి 1,500 వాట్స్ లోడ్ వరకు రూ.2,300, 1,500 నుంచి 2,000ల వాట్స్ లోడ్ వరకు రూ.3,020, 2వేల వాట్స్ కన్నా ఎక్కువ లోడ్ ఉంటే రూ.3,020తో పాటు ప్రతీ అదనపు వెయ్యి వాట్స్‌కు రూ.1,560 చొప్పున చెల్లించాలని పేర్కొన్నారు. అలాగే, అనుమతి లేకుండా ప్రధాన లైన్‌కు కొక్కేలు తగిలించి విద్యుత్ వాడొద్దని, మండపాల్లో నాణ్యమైన వైర్లను, స్విచ్‌లను వినియోగించాలని, సమస్యలు ఎదురైతే విద్యుత్ ఉద్యోగులకు లేదా ఖమ్మం సర్కిల్ కార్యాలయంలోని కంట్రోల్ రూం(94408 11525)కు సమాచారం ఇవ్వాలని అధికారులు సూచించారు.

గుమ్మడవల్లి వాసికి డాక్టరేట్


డాక్టరేట్ అందుకుంటున్న నాగిరెడ్డి

సత్తుపల్లి: సత్తుపల్లిలో శాంతినికేతన్ జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థి, అశ్వారావుపేట మండలం గుమ్మడవల్లికి చెందిన అత్తునూరి నాగిరెడ్డికి డాక్టరేట్ లభించింది. 'లోహ ఉత్ప్రేరక సమక్షంలో అల్కలైన్ల క్రియాశీలత'అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక గ్రంథానికి గాను హైదరాబాద్‌లోని సీఎస్ఐఆర్ – ఐఐసీటీ, ఏసీఎస్ఆర్ఐ – ఇండియా సంయుక్తంగా డాక్టరేట్ ప్రదానం చేశాయి. ఈ సందర్భంగా నాగిరెడ్డిని శాంతినికేతన్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.మమంద్రారెడ్డి, కరస్పాండెంట్ దొడ్డా శ్రీనివాసరెడ్డి, అధ్యాపకులు శుక్రవారం అభినందించారు.

నడిరోడ్డుపై తెగిపడ్డ 11 కేవీ విద్యుత్ తీగలు

కొణిజర్ల: జాతీయ రహదారిపై 11 కేవీ విద్యుత్ తీగలు తెగి పడగా, ఆ సమయంలో వాహనాలు లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. కొణిజర్లలోని సాగర్ కాల్వ సమీపాన ఓ దాబా వద్ద శుక్రవారం తెల్లవారుజామున 11 కేవీ విద్యుత్ వైరు తెగి రోడ్డుపై పడింది. ఆ సమయంలో రోడ్డుపై వాహనాలు రాకపోవడంతో ప్రమాదం జరగలేదు. దీంతో సమీపంలో ఉన్న వ్యక్తులు డయల్ 100కు ఫోన్ చేయగా, సరఫరా నిలిపివేయించి తీగలు తీయించామని ఎస్సై జె.శంకర్‌రావు తెలిపారు.

పురుగుల మందు తాగి వివాహిత ఆత్మహత్య

తిరుమలాయపాలెం: ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్య కారణాలతో ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. మండలంలోని ఇస్లావత్ తండాకు చెందిన ఇస్లావత్ సునీత(33)కు కొద్ది రోజులుగా అనారోగ్యంతో పాటు ఆర్థిక ఇబ్బందులు తోడయ్యాయి. దీంతో గురువారం ఆమె గడ్డి మందు తాగగా, కాసేపటికి గుర్తించిన కుటుంబీకులు ఖమ్మం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. సునీతకు భర్తతో పాటు ముగ్గురు పిల్లలు ఉండగా, ఆమె తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు.

చెడు వ్యసనాలకు బానిసై..

ఖమ్మంక్రైం: ఖమ్మం టూటౌన్ పరిధిలో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానిక రమణగుట్టలో నివసించే డుంగ్రోతు వివేక్ (20) తల్లి మృతి చెందటంతో అమ్మమ్మ వద్ద ఉంటున్నాడు. కొన్నాళ్లుగా చెడు వ్యసనాలకు బానిసైన ఆయనను అమ్మమ్మ మందలించటంతో శుక్రవారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. వివేక్ తండ్రి వీరేశ్ ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,026

సాఫీగా సాగిన టెట్


హాల్‌టికెట్లు తనిఖీ చేస్తున్న పోలీసు సిబ్బంది




పరీక్ష గదుల వివరాలు చూసుకుంటున్న అభ్యర్థులు

జిల్లా కేంద్రంలో శుక్రవారం టీచర్స్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) సాఫీగా సాగింది. అయితే, కొన్ని కేంద్రాల వద్ద దివ్యాంగులు, పిల్లల తల్లులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దివ్యాంగులకు కేంద్రాల్లోని మొదటి అంతస్తులో సీట్లు కేటాయించడంతో వెళ్లేందుకు అవస్థ పడ్డారు. కేంద్రాల సిబ్బంది, బంధువులు వారికి సహకరించాల్సి వచ్చింది. ఇక పిల్లలతో వచ్చిన తల్లిదండ్రులు బంధువులకు అప్పగించగా.. పరీక్ష అయిపోయేంత వరకు ఆడిస్తూ గడిపారు.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్


పరీక్ష కేంద్రంలో పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమ్


పరీక్ష హాల్‌లో అభ్యర్థులు


ఆటోలో పిల్లలకు అన్నం తినిపిస్తున్న అభ్యర్థి

వైద్య వృత్తి మహోన్నతమైనది...


విద్యార్థులు, తల్లిదండ్రులను ఉద్దేశించి మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రాజేశ్వరరావు, పక్కన ప్రొఫెసర్లు

- అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి
- మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ రాజేశ్వరరావు

ఖమ్మం వైద్యవిభాగం: వైద్య వృత్తి మహోన్నతమైందని.. ఈ వృత్తిని ఎంచుకున్న వారు అంకితభావం, చిత్తశుద్ధి ఎంబీబీఎస్ పూర్తిచేయాలని ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రాజేశ్వరరావు సూచించారు. ఖమ్మంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీని శుక్రవారం ప్రారంభించగా... విద్యార్థులు, వారి తల్లిదండ్రులను ఉద్దేశించి ప్రిన్సిపాల్ మాట్లాడారు. నూతన కాలేజీలో అన్ని వసతులు, నిష్ణాతులైన ప్రొఫెసర్లు ఉన్నారని తెలిపారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా 30 ఎకరాల స్థలంలో కళాశాల అందుబాటులోకి వచ్చిందన్నారు. మొదటి బ్యాచ్‌లో చేరిన విద్యార్థులు శ్రద్ధగా చదువుకుని ఎదగడం ద్వారా కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. అలాగే, విద్యార్థులు ర్యాగింగ్ దూరంగా ఉండాలని తెలిపారు. ఈసందర్భంగా పలువురు విద్యార్థులు వెల్లడించిన అభిప్రాయాలు ఇలా ఉన్నాయి.

పేదలకు సేవ చేయాలనేది కల



పేదలకు సేవ చేయాలనేది నా కల. వైద్యురాలిగా స్థిరపడితే సేవ చేయడానికి మెరుగైన అవకాశాలు ఉంటాయని ఎంబీబీఎస్‌ను ఎంచుకున్నా. ఖమ్మం కళాశాలలో సీటు రావటం ఆనందంగా ఉంది. ఎంబీబీఎస్ పూర్తయ్యాక ఎండీ న్యూరాలజీ చేస్తాను.

– అమూల్య, వరంగల్

గైనిక్ విభాగంలో పీజీ చేస్తా..



ఎంబీబీఎస్ సీటు సాధించడానికి చాలా కష్టపడాల్సి వచ్చింది. ప్రభుత్వ కళాశాలలో సీటు రావటంతో నా తల్లిదండ్రులు ఆనందపడ్డారు. ఎంబీబీఎస్ తర్వాత గైనిక్ విభాగంలో పీజీ చేసి ప్రభుత్వ ఆస్పత్రుల్లో విధులు నిర్వర్తించాలనేది నా ఆశయం. అందువల్లనే ఈ రంగాన్ని ఎంచుకున్నా.

– గనిత, హైదరాబాద్

కార్డియాలజీ పీజీ నా లక్ష్యం



సొంత జిల్లాలోని ప్రభుత్వ కాలేజీ ఎంబీబీఎస్ సీటు రావటం ఆనందంగా ఉంది. ఎంబీబీఎస్ పూర్తయ్యాక కార్డియాలజీ విభాగంలో పీజీ చేస్తా. సొంత జిల్లాలో సీటు సాధించడానికి అమ్మానాన్నల పోత్సాహం ఎంతో ఉంది. కష్టపడి చదవడంతో విజయం సాధించా.

– గగన్, మధిర

నాన్న ప్రోత్సాహంతో సీటు సాధించా



నాన్న ప్రోత్సాహంతోనే మంచి ర్యాంకు వచ్చింది. ఖమ్మం కళాశాలలో అడ్మిషన్ దొరకటం అదృష్టంగా భావిస్తున్నా. ఇక్కడి కళాశాల బాగుండడమే కాక దగ్గరలోనే ఆస్పత్రి, హాస్టల్ సౌకర్యం ఉంది. నిరుపేదలకు సాధ్యమైనంత మేర సేవలందించటం నా లక్ష్యం.

– అరుణ్, మిర్యాలగూడెం

2న దేశవ్యాప్త ఆందోళనలు

టీయూడబ్ల్యూజే(ఐజేయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విరాహత్ అలీ

ఖమ్మం సహకారనగర్: జర్నలిస్టుల హక్కుల సాధన, సమస్యల పరిష్కారం కోసం వచ్చేనెల 2న గాంధీ జయంతి సందర్భంగా దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టనున్నామని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.విరాహత్ అలీ వెల్లడించారు. ఖమ్మంలోని డీపీఆర్సీ భవనంలో శుక్రవారం యూనియన్ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాను ఎత్తేయడంతో పాటు వర్కింగ్ జర్నలిస్టుల చట్టాలను రద్దు చేసేందుకు కేంద్రప్రభుత్వం కుట్ర పన్నుతుందనిలారోపించారు. ఇందుకు వ్యతిరేకంగా ఆందోళనలు చేపట్టనున్నట్లు తెలిపారు. కాగా, జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలని, హెల్త్ కార్డులు అన్ని కార్పొరేట్ ఆస్పత్రుల్లో చెల్లుబాటయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం పలువురు ఐజేయూలో చేరగా వారిని సన్మానించారు. టీయూడబ్ల్యూజే(ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు వనం వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.రాంనారాయణ, జిల్లా కార్యదర్శి ఏనుగు వెంకటేశ్వర్‌రావు తోపాటు మైసా పాపారావు, శ్రీనివాస్, శంకర్‌గౌడ్, రవీంద్ర శేషు, వెంకట్రావు, మాటేటి వేణుగోపాల్, సామినేని మురారి, ఖాదర్ బాబా, ఆవుల శ్రీనివాస్, ఖదీర్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.


యూనియన్‌లో చేరిన వారిని సన్మానిస్తున్న నాయకులు

ఇస్రో శాస్త్రవేత్తకు సన్మానం

ఖమ్మం అర్బన్/ఖమ్మం సహకారనగర్: ఇటీవల ఇస్రో చేపట్టిన చంద్రయాన్–3 ప్రయోగంలో పాలుపంచుకున్న ఖమ్మంకు చెందిన శాస్త్రవేత్త వల్లూరు ఉమామహేశ్వరరావును రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సన్మానించారు. ఖమ్మంలోని క్యాంపు కార్యాలయంలో ఆయనను సన్మానించిన మంత్రి మాట్లాడుతూ దేశం సత్తాను చాటిన ప్రయోగంలో ఖమ్మం వాసి పాల్గొనడం ఆనందంగా ఉందని తెలిపారు. ఈకార్యక్రమంలో కార్పొరేటర్ కొత్తపల్లి నీరజ తదితరులు పాల్గొన్నారు. అలాగే, ఉమామహేశ్వరరావు చదువుకున్న నిర్మల్ హృదయ్ పాఠశాలలో ఆయనను కరస్పాండెంట్ వంగా సాంబశివారెడ్డి, డైరెక్టర్ సుధాకర్‌రెడ్డి, హెచ్ఎంలు ఏ.పద్మజ, శ్రావణి తదితరులు సన్మానించారు.


ఉమామహేశ్వరరావుతో నిర్మల్ హృదయ్ పాఠశాల యాజమాన్యం

యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా యాసిన్

ఖమ్మం సహకారనగర్: యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా షేక్ యాసిన్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయనకు జిల్లా అధ్యక్షుడు యడ్లపల్లి సంతోష్ నియామకపత్రం అందజేశారు. అనంతరం యాసిన్ మాట్లాడుతూ తనను నియమించడంపై సీఎల్పీ నేత భట్టి విక్రమార్క, పువ్వాళ్ల దుర్గాప్రసాద్, శివసేనారెడ్డి, సంతోష్ తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.


నియామకపత్రం అందుకుంటున్న యాసిన్

సీఎం నా గుండెల్లో ఉన్నారు...

వైరా ఎమ్మెల్యే రాములునాయక్

కారేపల్లి: టికెట్ రాలేదని బాధలేదు.. హ్యాపీగానే ఉన్నాను... నా గుండెల్లో కేసీఆర్ ఉన్నంత కాలం ఇబ్బంది రాదు.. అని వైరా ఎమ్మెల్యే రాములునాయక్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం కల్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులకు ఆయన చెక్కులు అందజేసి మాట్లాడారు. సీఎం కేసీఆర్‌ను మూడోసారి ముఖ్యమంత్రి చేయడంలో ముందుంటానని.. ఆయన సూచనల మేరకు మదన్‌లాల్ గెలుపునకు కృషి చేస్తానని తెలిపారు. ఈ విషయంలో అందరూ కలిసి రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మాలోతు శకుంతల, జెడ్పీటీసీ వాంకుడోతు జగన్‌నాయక్, ఎంపీడీఓ చంద్రశేఖర్, తహసీల్దార్ వి.సురేష్‌కుమార్, సర్పంచ్ ఆదెర్ల స్రవంతితో పాటు రావూరి శ్రీనివాసరావు, పెద్దబోయిన ఉమాశంకర్, దుగ్గినేని శ్రీనివాసరావు, అడ్డగోడ ఐలయ్య, ముత్యాల సత్యనారాయణ, ఇమ్మడి రమాదేవి, నాయకులు పాల్గొన్నారు.


చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే రాములునాయక్

నలుగురి బైండోవర్

కల్లూరు రూరల్: మండలంలో ఎక్సైజ్ అధికారులు శుక్రవారం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా నాటునారా తయారు చేస్తున్న కృష్ణవేణి, లక్ష్మి, రాములమ్మ, మహేష్‌ను తహసీల్దార్ బాబ్జీప్రసాద్ ఎదుట బైండోవర్ చేశారు. సీఐ రాజశేఖరరావు, ఎస్ఐ వెంకటేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లా కేంద్రంలోని నెహ్రూ యువక కేంద్రం ఆధ్వర్యాన శుక్రవారం జిల్లాస్థాయి వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఇప్పటికే మండలాల్లో నిర్వహించిన పోటీల్లో విజేతలుగా నిలిచిన ఆరుగురు జిల్లా స్థాయి పోటీలకు హాజరయ్యారు. వీరిలో విద్యార్థి సూర్యనారాయణ రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాడు. కాగా, ఈ పోటీలకు జిల్లా నెహ్రూ యువక కేంద్రం ఉద్యోగి భానుచందర్, మహిళా డిగ్రీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.పద్మారాణి, ఫ్రెండ్స్ యూత్ అధ్యక్షుడు తాటిపల్లి సుధీర్ న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు.


రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థితో న్యాయనిర్ణేతలు

రేగులచెలకకు అవార్డు అభినందనీయం

రఘునాథపాలెం/ఖమ్మం వన్‌టౌన్: స్వచ్ఛ సర్వేక్షణ్‌లో రఘునాథపాలెం మండలం రేగులచెలక రాష్ట్ర స్థాయిలో ఉత్తమ గ్రామపంచాయతీగా ఎంపిక కావడం అభినందనీయమని రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. హైదరాబాద్‌లో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు చేతుల మీదుగా రేగులచెలక సర్పంచ్ కొర్లపాటి రామారావు, కార్యదర్శి సంగీత అవార్డు స్వీకరించారు. ఈమేరకు వారు శుక్రవారం రాష్ట్ర రవాణా మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌ను క్యాంపు ఆఫీస్‌లో కలవగా పాలకవర్గం, అధికారులను సన్మానించారు. డీఆర్డీఓ విద్యాచందన, ఇన్‌చార్జ్ డీపీఓ అప్పారావుతో పాటు సున్నా వెంకటేశ్వర్లు, సున్నా శ్రీనివాసరావు పాల్గొన్నారు.


సర్పంచ్, అధికారులను సత్కరిస్తున్న మంత్రి

లారీ బోల్తా, డ్రైవర్‌కు గాయాలు

కొణిజర్ల: చేపల చెరువుల్లో వేసే దాణా బస్తాలతో వెళ్తున్న లారీ అదుపు తప్పి రోడ్డు పక్కన బోల్తా పడిన ఘటన కొణిజర్ల మండల పరిషత్ కార్యాలయం సమీపంలో శుక్రవారం జరిగింది. మహారాష్ట్ర నుంచి ఏపీలోని కైకలూరుకు చేపల దాణా లోడుతో వెళ్తున్న లారీ కొణిజర్ల ఎంపీడీఓ కార్యాలయం సమీపాన అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో లారీ డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడగా దాణా బస్తాలు కింద పడ్డాయి. దీంతో దాణా బస్తాలను ఇంకో లారీలో పంపించగా, ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.


కొణిజర్లలో బోల్తా పడిన లారీ

బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి

ఖమ్మం సహకారనగర్: గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ తక్షణమే చేపట్టాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వి.వెంకటేశ్వరరావు, ఎస్.విజయ్ డిమాండ్ చేశారు. ఈసందర్భంగా శుక్రవారం టీపీటీఎఫ్ ఆధ్వర్యాన జిల్లా గిరిజన సంక్షేమ శాఖ డీడీ కార్యాలయం ఎదుట నిరసన తెలిపి అధికారులకు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడగా నాయకులు మల్లయ్య, ప్రసాదరావు, శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.



నిరసనలో పాల్గొన్న టీపీటీఎఫ్ నాయకులు

బ్యాంక్ ఉద్యోగి అదృశ్యం

ఖమ్మంక్రైం: ఖమ్మం త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బ్యాంకులో పనిచేసే ఉద్యోగి కానరాకుండా పోయాడు. ఏపీలోని కోనసీమ జిల్లా రాజోలు మండలం తాటిపాకకు చెందిన గడికంటి సీతారామకృష్ణదత్త ఖమ్మం గాంధీచౌక్‌లోని భద్రాద్రి బ్యాంక్‌లో పనిచేస్తున్నాడు. ఆయన బ్యాంకు ఇచ్చిన సిమ్‌ను కార్యాలయంలో వదిలేసి వెళ్లిపోయాడు. ఇంకో నంబర్ కూడా స్విచాఫ్ వస్తుండడంతో ఆయన తండ్రి హన్మంతరావు ఫిర్యాదు మేరకు పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రమణాతండాలో చెరువు శిఖం ఆక్రమణ

తిరుమలాయపాలెం: మండలంలోని బాలాజీనగర్ తండా జీపీ పరిధి రమణాతండాలో ఓ రైతు చెరువు శిఖం భూమిని ఆక్రమించుకుని జేసీబీతో చదును చేశాడు. ఈ విషయమై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు రెవెన్యూ, ఆర్ అండ్ బీ అధికారులను కోరుతున్నారు. గ్రామానికి చెందిన ఓ రైతు తన పట్టా భూమిని అమ్మేశాడు. ఆతర్వాత భూమి పక్కన చెరువు శిఖాన్ని ఎకరం మేర జేసీబీ సాయంతో చదును చేయించడమేకాక బీటీ రహదారి పక్కన మట్టి తవ్వించాడు. అయినా ఎవరూ పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపించారు. ఈ విషయమై తహసీల్దార్ పి.రాంప్రసాద్‌ను వివరణ కోరగా చెరువు శిఖంను ఆక్రయించినట్లు తేలితే చర్యలు తీసుకుంటామని తెలిపారు.


ఆర్ అండ్ బీ రహదారి పక్కన తవ్విన దృశ్యం

లారీ కిందపడి డ్రైవర్ మృతి

సత్తుపల్లిరూరల్/దమ్మపేట: ప్రమాదవశాత్తు లారీ కింద పడి డ్రైవర్ మృతి చెందిన ఘటన దమ్మపేట మండలం మంగాపురం గ్రామశివారులో శుక్రవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, స్థానికుల కథనం ప్రకారం.. సత్తుపల్లి మండలం రామానగరం గ్రామానికి చెందిన బెజవాడ రాము(30) లారీడ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. లారీని నడుపుకుంటూ వెళ్తున్న రాముకు శబ్దంలో ఏదో తేడా అనిపించింది. మంగాపురం గ్రామశివారులో లారీని ఆపి దాని కిందకు వంగి చెక్ చేస్తున్నాడు. ప్రమాదవశాత్తు లారీ ఆయన పైనుంచి వెళ్లడంతో రాము అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్తుపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేశారు.


బెజవాడ రాము (ఫైల్)

మృత్యువుతో పోరాడి ఓడిన అముద

క్యాన్సర్‌తో బాధపడుతూ చికిత్స పొందుతూ మృతి


అముద (ఫైల్)

కోదాడ: క్యాన్సర్ మహమ్మారితో పోరాడుతున్న అముద అనే అభాగ్యురాలు చివరకు ఓడిపోయింది. ఆరు నెలలుగా చికిత్స పొందుతూ శుక్రవారం తుదిశ్వాస విడిచింది. తమిళనాడులో పుట్టి పెరిగిన అముద నారాయణ నాడార్(40) మతిస్థిమితం కోల్పోయి 15 ఏళ్ల క్రితం సూర్యాపేట జిల్లా కోదాడకు చేరుకుంది. మున్సిపాలిటీ చెత్తకుప్పల్లో ఆహారాన్ని వెతుక్కుంటుండగా పల్లా వెంకటేశ్వర్లు అనే స్థానికుడి కంటపడింది. ఆమెను వెంకటేశ్వర్లు చేరదీసి ఆదరించాడు. దాతలు, మానసిక వైద్యనిపుణుడు డాక్టర్ రఘురామిరెడ్డి సాయంతో మంచిమనిషిగా మార్చాడు. కొంతకాలం విద్యావలంటీర్‌గా పనిచేసింది. కోదాడ వ్యవసాయ మార్కెట్‌లో అటెండర్‌గా ఉద్యోగం చేస్తున్న క్రమంలో ఆరునెలల క్రితం ఆమె అనారోగ్యం బారిన పడింది. వైద్యులు పరీక్షించి క్యాన్సర్ అని తేల్చారు. వెంకటేశ్వర్లు ఆమెను హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చేర్పించి వైద్యం చేయించినా ఫలితం లేకపోయింది. వ్యాధి ముదరడంతో తీవ్రంగా ఇబ్బందిపడుతూ శుక్రవారం కోదాడలోని వెంకటేశ్వర్లు ఇంట్లోనే కన్నుమూసింది.

అడుగడుగునా అండగా నిలిచిన ‘సాక్షి’

చెత్తకుప్పల మధ్య ఉన్న అముదను వెంకటేశ్వర్లు ఆదరించిన వైనాన్ని, ఆ తర్వాత మంచిమనిషిగా మారిన అముద గురించి పలు సందర్భాల్లో ‘సాక్షి’కథనాలు ప్రచురించింది. అముద జీవిత చరిత్రను టెలిఫిల్మ్‌గా తీసిన విషయాన్ని కూడా వెలుగులోకి తెచ్చింది. అముదకు క్యాన్సర్ సోకిన విషయాన్ని ‘అయ్యో అముద’శీర్షికన కథనం ప్రచురించడంతో దాతలు ముందుకొచ్చి సాయం కూడా అందించారు.

మూడు ‘రియల్’ సంస్థలకు రూ. 50 లక్షల జరిమానా

సాక్షి, హైదరాబాద్: జయత్రి(జయ గ్రూపు) ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఏజీఎస్ శ్రీనివాసం ప్రాపర్టీస్ ప్రైవేట్ లిమిటెడ్, ఈఏపీఎల్ సంస్థలు నిబంధనలు ఉల్లంఘించి పత్రికలు, టీవీల్లో ప్రకటనలు ఇవ్వడమేకాక, మార్కెటింగ్ నిర్వహించడంపై రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ(రెరా) కన్నెర్ర చేసింది. ఈ సంస్థలపై రూ. 50 లక్షల జరిమానా విధిస్తూ శుక్రవారం రెరా చైర్మన్ డాక్టర్ ఎన్.సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు.


ఎస్ఎస్ తాడ్వాయి మండలం మేడారంలో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

ఏజెన్సీకి వైద్యాధికారులు

‘సాక్షి’ కథనానికి స్పందన

సాక్షి ఎఫెక్ట్

సాక్షిప్రతినిధి, వరంగల్: ఏజెన్సీలో ప్రబలుతున్న విషజ్వరాలపై శుక్రవారం ‘సాక్షి’ ప్రధాన సంచికలో ‘ఏజెన్సీకి ఫీవర్’ శీర్షికన ప్రచురితమైన కథనానికి వైద్యాధికారులు స్పందించారు. జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేశారు. మహాముత్తారం మండలకేంద్రంతోపాటు అటవీ గ్రామాలైన సింగారం, పోలారం ప్రేమ్‌నగర్ తండాల్లో మండల వైద్యాధికారి సందీప్ ఆధ్వర్యంలో ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేశారు. ఇంటింటి సర్వే నిర్వహించి జ్వరాల బారిన పడిన వారి వివరాలు సేకరించారు. ములుగు జిల్లా వాజేడు మండలం ఇప్పగూడెంలో వైద్యశిబిరం నిర్వహించి 100మందికి మందుల కిట్ అందజేశారు. వాజేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్‌ఓ అప్పయ్య సందర్శించి రోగులను పరీక్షించారు. తాడ్వాయి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మేడారం, గంగారం గ్రామాల్లో, కొడిశాల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఎల్బాక, పడిగాపూర్ గ్రామాల్లో వైద్యశిబిరాలు నిర్వహించారు. మంగపేట మండలంలోని నర్సింహసాగర్, అకినేపల్లిమల్లారంలో వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి రక్త నమూనాలు సేకరించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు.

అజ్ఞాతం వీడండి

- మావోయిస్టులకు డీజీపీ అంజనీకుమార్ పిలుపు
- కేంద్ర కమిటీ సభ్యుడు సంజోయ్ దీపక్‌రావు అరెస్టు


మీడియాతో మాట్లాడుతున్న డీజీపీ. చిత్రంలో సంజోయ్ దీపక్‌రావు

సాక్షి, హైదరాబాద్: మావోయిస్టు రాష్ట్ర కమిటీ సభ్యులు, తెలంగాణకు చెందిన అగ్రనేతలు, కేడర్ అజ్ఞాతం వీడి పోలీసులకు లొంగిపోవాలని డీజీపీ అంజనీకుమార్ విజ్ఞప్తి చేశారు. మావోయిస్టులు అజ్ఞాతం వీడి రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు సంజోయ్ దీపక్‌రావును శుక్రవారం ఉదయం కూకట్‌పల్లిలోని మలేషియన్ టౌన్‌షిప్‌లో అరెస్టు చేసినట్టు డీజీపీ తెలిపారు. నాలుగు రోజుల క్రితం హైదరాబాద్‌కు వచ్చిన దీపక్‌రావు ఛత్తీస్‌గఢ్‌లోని మాడ్ ప్రాంతంలో ఓ మావోయిస్టు సమావేశానికి హాజరుకావాల్సి ఉందని, ఆయన కదలికలపై ఎస్ఐబీ (స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో)కు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు సైబరాబాద్ పోలీసులు అరెస్టు చేశారన్నారు. ఒక రివాల్వర్, ఆరు లైవ్‌రౌండ్లు(బుల్లెట్లు), రూ.47,250 నగదు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. మలేషియన్ టౌన్‌షిప్‌లో ఉండే మహేంద్రటెక్ యూనివర్సిటీ ప్రొఫెసర్ రంజిత్‌శంకరన్, మాదాపూర్‌కు చెందిన ఓ సినీ దర్శకుడు బి.అజిత్‌కుమార్‌లు దీపక్‌రావుకు ఆశ్రయం ఇచ్చినట్టు గుర్తించామన్నారు. శుక్రవారం డీజీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. కొన్నేళ్లుగా తెలంగాణ నుంచి మావోయిస్టుల రిక్రూట్‌మెంట్ పూర్తిగా శూన్యమని, సంజోయ్ దీపక్‌రావు అరెస్టుతో ఆ పార్టీకి ఎదురుదెబ్బ తగిలినట్టయ్యిందన్నారు. దీపక్‌రావు మావోయిస్టు అగ్రనేతలు గణపతి, బస్వరాజ్, కోసాలతో నేరుగా సంబంధాలున్నట్టు తెలిపారు.

నాలుగు రాష్ట్రాల పోలీసులకు మోస్ట్ వాంటెడ్

సంజోయ్ దీపక్‌రావు ప్రస్తుతం కేంద్ర కమిటీతోపాటు సౌత్ రీజియన్ బ్యూరో ఇన్‌చార్జ్‌గా, వెస్ట్రన్ ఘాట్ స్పెషల్ జోన్ కమిటీ కార్యదర్శిగా ఉన్న ఆయన మహారాష్ట్ర, కేరళ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల పోలీసులతోపాటు జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ)కు మోస్ట్‌వాంటెడ్‌గా ఉన్నారు. దీపక్‌రావుపై మహారాష్ట్ర ప్రభుత్వం రూ.25 లక్షల రివార్డు ప్రకటించింది. మహారాష్ట్రలోని థానే జిల్లా అంబర్‌నాథ్ ఈస్ట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని శివగంధనగర్‌కు చెందిన సంజయ్ దీపక్‌రావు జమ్మూకశ్మీర్‌లో 1984లో బీటెక్ పూర్తి చేశారు. 1999లో సీపీఐఎంఎల్ రవూఫ్ గ్రూప్‌లో తొలుత చేరారు. నక్సల్‌బరీ గ్రూప్‌నకు మహారాష్ట్ర ఇన్‌చార్జ్‌గా పనిచేశారు. 2000లో ఓసారి అరెస్టు, తర్వాత విడుదలై మళ్లీ అజ్ఞాతంలోకి వెళ్లారు. 2002లో అనంతపురం జిల్లా రాయదుర్గం ప్రాంతంలో మావోయిస్టు కార్యకలాపాల వ్యాప్తికి కీలకంగా పనిచేశారు. 2014లో నక్సల్‌బరీ, సీపీఐ మావోయిస్టులో విలీనం కావడంలో కీలక పాత్ర పోషించారు. నవంబర్ 2021లో పశ్చిమ కనుమల ప్రత్యేక జోనల్ కమిటీ కార్యదర్శి బీజీ కృష్ణమూర్తి అరెస్టు తర్వాత, ఆ జోనల్‌కు ప్రత్యేక జోనల్ కమిటీకి కార్యదర్శిగా నియామకం కాగా, అప్పటి నుంచి అక్కడే పనిచేస్తున్నారు.

మంత్రాల నెపంతో ఇద్దరిపై దాడి


బానోత్ నరేశ్, భాస్కర్‌ను చెట్టుకు కట్టేసిన దృశ్యం

నర్సాపూర్‌రూరల్: మంత్రాల నెపంతో ఇద్దరిని చెట్టుకు కట్టేసి చితకబాదిన ఘటన మెదక్ జిల్లాలో శుక్రవారం చోటు చేసుకుంది. నర్సాపూర్ మండలం పాప్యా తండాకు చెందిన బానోత్ లావణ్యకు జ్వరం రావడంతో ఈ నెల 14న నర్సాపూర్‌లోని ఓ ఆస్పత్రిలో చేర్పించారు. విషయం తెలుసుకున్న మెదక్ మండలం సంగాయిగుడి తండాకు చెందిన బంధువులు నేనావత్ భాస్కర్, మూడవత్ భాస్కర్ అదేరోజు సాయంత్రం వచ్చి లావణ్య, ఆమె భర్త నరేశ్‌ను పరామర్శించారు. ఈ క్రమంలో వైద్యులు ఆమెను రాత్రి డిశ్చార్జి చేయడంతో అందరూ కలిసి ఇంటికి చేరుకున్నారు. రాత్రి 10గంటల సమయంలో మూత్రవిసర్జన నిమిత్తం బయటికి వచ్చిన భాస్కర్‌ను స్థానికులైన రమావత్ సక్రు, రమావత్ మోహన్ అనుమానించి చెట్టుకు కట్టేసి చితకబాదారు. అరుపులు విని నరేశ్ బయటకు వచ్చి స్థానికులకు నచ్చజెప్పి తీసుకెళ్లాడు. శుక్రవారం ఉదయం మళ్లీ స్థానికులు నరేశ్ ఇంటికి చేరుకున్నారు. తమ ఇంటి చుట్టూ నిమ్మకాయలు, పసుపు, కుంకుమ ఉన్నాయంటూ భాస్కర్, నరేశ్‌లను చెట్టుకు కట్టేసి కట్టెలు, రాళ్లతో కొట్టారు. ఈ ఘటనపై బాధితుడి నరేశ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.



సునీతను టైరు సహాయంతో వాగు దాటిస్తున్న గజ ఈతగాళ్లు

టైరును తెప్పలా చేసి.. గర్భిణిని వాగు దాటించి..

ఏటూరునాగారం: ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం ఎలిశెట్టిపల్లి వద్ద ఏటా వర్షాకాలంలో జంపన్నవాగు ప్రవాహంతో బానాజీబంధం, ఎలిశెట్టిపల్లి గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఎలిశెట్టిపల్లికి చెందిన దబ్బకట్ల సునీత ఏడు నెలల గర్భిణి. ఆమెకు శుక్రవారం నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తీసుకెళ్లడానికి సిద్ధమయ్యారు. జంపన్న వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. అక్కడే ఉన్న కొందరు గజ ఈతగాళ్లు, స్థానికుల సహాయంతో ట్రాక్టర్ వెనుక టైరును తెప్పలా మార్చారు. దానిపై గర్భిణిని కూర్చోబెట్టి వాగు దాటించి ఆస్పత్రికి తరలించారు. వైద్యులు ఆమెకు పరీక్షలు చేసి సాధారణమైన నొప్పులేనని చెప్పడంతో కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు. వాగుపై వంతెన నిర్మిస్తే తమ కష్టాలు తొలగిపోతాయని, ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో తాత్కాలిక బోటు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అంగన్‌వాడీల్లో కొత్త కొలువులు!

- మినీ కేంద్రాల అప్‌గ్రేడ్‌తో 3,989 హెల్పర్ పోస్టులకు చాన్స్
- కసరత్తు చేస్తున్న మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ

సాక్షి, హైదరాబాద్: మినీకేంద్రాల స్థాయి పెంచి ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాలుగా మార్పు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో కొత్త కొలువులకు అవకాశం ఏర్పడింది. రాష్ట్రంలో 149 ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 35,700 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. ఇందులో 31,711 కేంద్రాలు ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాలు కాగా, 3,989 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు. ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాల్లో ఒక టీచర్, ఒక హెల్పర్ ఉంటే.. మినీకేంద్రాల్లో మాత్రం ఒక టీచర్ ఉంటారు. ఇక్కడ హెల్పర్ ఉండరు. తాజాగా మినీ కేంద్రాల అప్‌గ్రేడ్‌తో అక్కడ హెల్పర్ పోస్టు అనివార్యమైంది. రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖకు అప్‌గ్రేడ్ వివరాలు పంపింది. ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాలుగా మార్చడంతో వాటికి కేంద్రం నుంచి రావాల్సిన గ్రాంట్ కూడా పెరుగుతుంది. కేంద్ర ప్రభుత్వం అంగీకరిస్తే కొత్తగా హెల్పర్ల నియామకం చేపట్టొచ్చు.

టీచర్ల భర్తీ తర్వాతే...

రాష్ట్రవ్యాప్తంగా పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన రిటైర్మెంట్ పాలసీతో దాదాపు రెండున్నర వేలమంది టీచర్లు పదవీ విరమణ పొందాల్సి ఉంది. ఈక్రమంలో అన్ని రకాల్లో కలిపి నాలుగువేల వరకు పోస్టులు ఖాళీగా ఉంటాయి. అయితే కొన్ని జిల్లాల్లో అంగన్‌వాడీ టీచర్ పోస్టులకు రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ నోటిఫికేషన్లు జారీ చేసి, భర్తీ ప్రక్రియ ప్రారంభించింది. అయితే వివిధ కారణాలతో ఆ ప్రక్రియ పూర్తి కాలేదు. తాజాగా మినీ కేంద్రాల అప్‌గ్రెడేషన్‌తో హెల్పర్ పోస్టులు భర్తీ చేయాల్సి ఉండగా, అంతకుముందే అంగన్‌వాడీ టీచర్ పోస్టులు భర్తీ చేయాలని అధికారులు భావిస్తున్నారు. ఈమేరకు జిల్లాల వారీగా ఖాళీల వివరాలతో కూడిన ప్రతిపాదనలు సమర్పించాలని రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ జిల్లా సంక్షేమాధికారులను ఆదేశించింది. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే సూచనలకు అనుగుణంగా అధికారులు తదుపరి చర్యలు తీసుకుంటారు.

జిల్లా వార్తలు

ఎస్సీ గురుకులాల్లో స్పాట్ అడ్మిషన్లు

ఖమ్మంమయూరిసెంటర్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో 5 నుంచి 9వ తరగతి వరకు మిగిలిన సీట్లను స్పాట్ కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేయనున్నట్లు ఆర్సీఓ కె.ప్రత్యూష ఒక ప్రకటనలో తెలిపారు. ఖమ్మం రీజియన్ పరిధి ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల్లోని గురుకులాల్లో మిగిలిన సీట్ల భర్తీకి ఈనెల 23న కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. గతంలో బ్యాక్‌లాగ్ ప్రవేశ పరీక్ష రాసిన ఎస్సీ విద్యార్థులు హాల్‌టికెట్లతో ఖమ్మంలోని డాక్టర్ అంబేద్కర్ జూనియర్ కళాశాలలో జరిగే కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని సూచించారు. అయితే, అనాథలు, పాక్షిక అనాథలు, దివ్యాంగ విద్యార్థులకు ప్రాధాన్యత ఉంటుందని, ఇందుకోసం ధ్రువీకరణ పత్రాలు తీసుకురావాలని ఆర్సీఓ తెలిపారు.

ఎన్‌జీటీ ఆదేశాల ఉల్లంఘనపై ఏం చర్యలు తీసుకున్నారు?

అశ్వాపురం: పర్యావరణ అనుమతులు లేకుండా జరుగుతున్న సీతమ్మసాగర్ బహుళార్థ సాధక ప్రాజెక్ట్ పనులు ఆపేయాలని జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ) ఇచ్చిన ఆదేశాలు ఉల్లంఘించిన తెలంగాణ ప్రభుత్వంపై ఏం చర్యలు తీసుకున్నారని ట్రిబ్యునల్ ధర్మాసనం ప్రశ్నించింది. చెన్నైలోని ఎన్‌జీటీ ధర్మానంలో శుక్రవారం సీతమ్మసాగర్ బహుళార్థసాధక ప్రాజెక్ట్‌పై విచారణ జరిగింది. ఎన్‌జీటీ ఆదేశాల ఉల్లంఘనపై ఏం చర్యలు తీసుకున్నారో చెప్పాలని ధర్మాసనం కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖను ప్రశ్నించింది. కాగా, పర్యావరణ అనుమతులు లేకుండా ఎన్‌జీటీ ఆదేశాలు ఉల్లంఘించి ప్రాజెక్ట్ పనులు చేపట్టడంతో ప్రభుత్వానికి ఇటీవలే షోకాజ్ నోటీసులు ఇచ్చామని అధికారులు బదులిచ్చారు. అయితే, షోకాజ్ నోటీసుపై 15 రోజుల్లో వివరణ తీసుకుని అందజేయాలని సూచిస్తూ తదుపరి విచారణను అక్టోబర్ రెండో వారానికి ఎన్‌జీటీ వాయిదా వేసింది.

పోస్టల్ పథకాలను సద్వినియోగం చేసుకోండి

కూసుమంచి: తపాలా శాఖ ఆధ్వర్యాన అమలవుతున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఖమ్మం సౌత్ డివిజన్ ఐపీ బాజీబాబు సూచించారు. కూసుమంచి మండలంలోని జక్కేపల్లిలో శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. పోస్టాఫీస్ బీమా పథకం ప్రజలకు ఎంతో మేలు చేస్తుందని, తక్కువ ప్రీమియంతోనే రూ.10 లక్షల బీమా అమలవుతోందని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ నలబోలు మాధవి, ఎంపీటీసీ కందుల వెంకటనారాయణ, తపాలా శాఖ ఉద్యోగులు పి.నాగేశ్వరరావు, లక్ష్మణ్, సోమేశ్వరరావు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పెసర.. దక్కని మద్దతు ధర

- కనీస ధర లేక రైతుల ఆవేదన
- ఇప్పటికే దిగుబడి లేక అవస్థ
- వ్యాపారి చెప్పిందే వేదం
- ప్రభుత్వం రంగంలోకి దిగితేనే ఫలితం



ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు రైతులు తీసుకొచ్చిన పెసలు (ఇన్‌సెట్) పెసలను కాంటా వేస్తున్న హమాలీలు

ఖమ్మంవ్యవసాయం: వానాకాలం సాగు చేసిన పెసర పంట చేతికొస్తోంది. వ్యవసాయ మార్కెట్లలో విక్రయాలు కూడా ప్రారంభమయ్యాయి. ఈ ఏడాది పెసర సాగు ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో సాగగా.. తొలినాళ్లలో వర్షాలు కురవకపోవటంతో సాగు తడబడింది. జిల్లాలో విస్తారంగా సాగు చేసే పెసర ఈసారి 14,312 ఎకరాలకే పరిమితమైంది. ఆతర్వాత కూడా ప్రతికూల పరిస్థితులే ఎదురుకావడంతో దిగుబడిపై ప్రభావం చూపింది. ఇక అరకొరగా వచ్చిన దిగుబడికి సైతం మద్దతు ధర కూడా దక్కటం లేదు. ఓ వైపు పప్పుల ధరలు ఆకాశాన్నంటుతుండగా, రైతు పండించిన పెసర పంటకు మాత్రం కనీస మద్దతు ధర లేక ఆవేదన చెందుతున్నారు. పొంతన లేని ధరలతో వ్యాపారులు కొనుగోళ్లు చేస్తుండగా.. నిల్వ చేయలేక, ప్రభుత్వం ఎప్పుడు కొనుగోళ్లు చేస్తుందో తెలియక ఎంతో కొంతకు అమ్మేసుకుంటున్నారు.

రూ.7వేల నుంచి రూ.8వేల వరకే..

పెసలకు కనీస మద్దతు ధర లభించడం లేదు. పంట చేతికొస్తుండడంతో ఇతర పంటల సాగు పెట్టుబడి కోసం రైతులు విక్రయిస్తున్నారు. ఈ ఏడాది కేంద్రప్రభుత్వం పెసలు క్వింటాకు కనీస మద్దతు ధర రూ.8,558గా నిర్ణయించింది. అయితే ప్రస్తుతం వ్యవసాయ మార్కెట్లలో రూ.7వేలు మొదలు రూ.8,200 వరకే కొనుగోళ్లు చేస్తున్నారు. అదే పెసర పప్పు కేజీ రూ.130 వరకు ధర పలుకుతోంది. వ్యాపారులు విక్రయించే పప్పుకు ధర పలుకుతుండగా, రైతులు విక్రయించే పెసలకు మాత్రం ధర పెట్టడం లేదు.


ప్రభుత్వ కొనుగోళ్లు లేకపోవడంతోనే..

ప్రభుత్వం కొనుగోళ్లకు రంగంలోకి దిగితేనే పంటకు మద్దతు ధర దక్కే అవకాశం ఉంది. ప్రభుత్వం పెసల కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు ముందుకు వస్తే జాతీయంగా, అంతర్జాతీయంగా పెసలకు ఉన్న డిమాండ్ తెరపైకి వస్తుంది. కానీ ప్రభుత్వం దృష్టి సారించకపోవడంతో ఇదే అదునుగా వ్యాపారులు ఇష్టారాజ్యంగా ధర నిర్ణయించి రైతులను దగా చేస్తున్నారు. రెండేళ్లుగా ఇదే తంతు కొనసాగుతోంది. జిల్లాలో అపరాల పంటల్లో మెట్ట పంటగా రైతులు పెసర సాగు చేస్తారు. ఈ ఏడాది వానాకాలంలో జిల్లాలో పెసర సాగు లక్ష్యం 25 వేల ఎకరాలుగా నిర్దేశించినా.. ప్రకృతి వైపరీత్యాలు, నష్టాలను దృష్టిలో పెట్టుకొని రైతులు తక్కువగానే సాగు చేశారు.

వ్యాపారి చెప్పిందే వేదం...

కేంద్రప్రభుత్వం ఈ ఏడాది పెసలు క్వింటాకు కనీస మద్దతు ధర గత ఏడాది రూ.7,755, ఈ ఏడాది రూ.8,558గా నిర్ణయించింది. గతంతో పోలిస్తే ఈ ఏడాది క్వింటాకు ఏకంగా రూ.803 పెంచారు. రైతులను ప్రోత్సహించటంలో భాగంగా ధర పెంచినా... ఆ ధర రైతులకు ఎక్కడా లభించడం లేదు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటైతే తప్ప ఫలితం ఉండదని తెలిసినా ఎవరూ పట్టించుకోవడం లేదు. గ్రామాల్లో క్వింటాకు రూ.6,500 నుంచి రూ.7వేల వరకు చెల్లిస్తుండగా, ఖమ్మం మార్కెట్‌లో రూ.7నుంచి రూ.8 వేల వరకు కొనుగోళ్లు చేస్తున్నారు. పంటకు డిమాండ్ ఉన్నా వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడడంతోనే ఈ పరిస్థితి నెలకొన్నట్లు చెబుతున్నారు. కాగా, ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో పంట సాగు తగ్గడంతో పాటు ఆశించిన స్థాయిలో దిగుబడి కూడా రాలేదు. ఎకరాకు ఐదు నుంచి ఆరు క్వింటాళ్లకు బదులు రెండు నుంచి మూడు క్వింటాళ్లకు మించి దిగుబడి వచ్చిందని అంచనా. ఎకరాకు రూ.15 వేల మేర పెట్టుబడి పెట్టగా... ఆ స్థాయిలో దిగుబడి లేక, ధర దక్కక రైతులు ఆవేదన చెందుతున్నారు.


పెసర సాగుతో నష్టమే..



ఎకరన్నర భూమిలో పెసర సాగు చేస్తే సుమారు నాలుగు క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ఇంకొందరికి ఆ దిగుబడి కూడా రాలేదు. వాతావరణం అనుకూలించక ఈ పరిస్థితి ఎదురైంది. క్వింటాకు రూ.8,500 వస్తుందనుకుంటే రూ.8,200 మాత్రమే రావడంతో నష్టపోయా.

– బందారు వీరభద్రం, కొణిజర్ల

ప్రభుత్వం కొనుగోలు చేస్తే బాగుండు



ప్రభుత్వం పెసలను కొనుగోలు చేస్తే కనీస మద్దతు ధర లభించేది. అలా జరగకపోవడంతో వ్యాపారులు చెప్పిన ధరకే అమ్మక తప్పలేదు. పెసలు నాణ్యతగా ఉన్నా రూ.8 వేలకు మించి అడగటం లేదు. ఇకనైనా ప్రభుత్వం కొనుగోలు చేస్తే రైతులకు ప్రయోజనం ఉంటుంది.

– జక్కి యాకయ్య, ముదిగొండ మండలం

పదోన్నతితోపాటు పెన్షన్ స్కీం అమలు చేయాలి

ముదిగొండ: విద్యుత్ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించడమే కాక పెన్షన్ స్కీం అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల సంఘం గౌరవ అధ్యక్షుడు గాదె మోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ముదిగొండలో ఐఎన్‌టీయూసీ అనుబంధ ఖమ్మం రూరల్ సబ్ డివిజన్ కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో మోహన్‌రెడ్డి మాట్లాడుతూ యూనియన్‌లో కష్టపడి పనిచేసేవారికి గుర్తింపు ఉంటుందని తెలిపారు. కాగా, ప్రభుత్వం ఉద్యోగులకు పెన్షన్ స్కీం అమలుచేయడమే కాక ప్రతీ సెక్షన్‌కు నాలుగు పోస్టులు మంజూరు చేయాలని, ఆర్టిజన్లకు ఏపీఎస్ఈబీ సర్వీస్ రూల్స్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులుగా ఎస్.కే.దావూద్, వెంకటరామారావును ఎన్నుకున్నారు. ఈసమావేశంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మందాటి సత్యనారాయణరెడ్డి, ఊటుకూరి సీతారాంగోపాల్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మోహన్‌రెడ్డి, పక్కన యూనియన్ నాయకులు

తాలిపేరుకు కొనసాగుతున్న వరద


చర్ల: తాలిపేరు వంతెన వద్ద గోదావరి ప్రవాహం

చర్ల: మండలంలోని తాలిపేరు మధ్యతరహా ప్రాజెక్టుకు వరద ఉధృతి కొనసాగుతోంది. ప్రాజెక్టు ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా వరద వచ్చి చేరుతుండడంతో ప్రాజెక్టు 25 గేట్లలో 23 గేట్లను రెండు అడుగుల చొప్పున, మిగతావి నాలుగు అడుగుల చొప్పున ఎత్తి దిగువకు 35,526 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 74 మీటర్లు కాగా, వరదను పరిగణనలోకి తీసుకుని 73.15 మీటర్లుగా క్రమబద్ధీకరిస్తున్నారు. కాగా, శుక్రవారం ఉదయం ప్రాజెక్టు వద్ద 20 మి.మీ. వర్షపాతం నమోదైంది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో భారీ వర్షాలు కొనసాగుతున్నందున ప్రాజెక్టులోకి వరద చేరే అవకాశముందని డీఈ తిరుపతి తెలిపారు.

పెరుగుతున్న గోదావరి నీటిమట్టం

చర్ల మండలంలో గోదావరి నీటిమట్టం క్రమేపీ పెరుగుతోంది. గోదావరి ఎగువన ఉన్న మహారాష్ట్రతో పాటు తాలిపేరు ప్రాజెక్టు ఎగువన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో భారీగా వర్షాలు కురుస్తుండగా వరద వచ్చి చేరుతోంది. ఇక నాలుగు రోజుల నుంచి తాలిపేరు ప్రాజెక్టు ద్వారా 70 నుంచి 80 వేల మేర క్యూసెక్కుల వరద విడుదల చేస్తుండడంతో గోదావరి నీటిమట్టం పెరుగుతోంది. మండలంలోని తేగడలో తాలిపేరు హైలెవల్ వంతెనపై సుమారు 7 అడుగుల మేర వరద నీరు ప్రవహిస్తోంది.


భద్రాచలం వద్ద తగ్గుముఖం

భద్రాచలంటౌన్: గోదావరి ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో భద్రాచలం వద్ద శుక్రవారం సాయంత్రం వరకు పెరిగిన గోదావరి పెరిగింది. అయితే, రాత్రయ్యే సరికి వరద తగ్గుముఖం పట్టింది. ఎగువ ప్రాజెక్టుల నుంచి వచ్చే భారీ వరదతో భద్రాచలం వద్ద 33.9 అడుగులకు చేరిన గోదావరి సుమారు అడుగు తగ్గి రాత్రి 8 గంటలకు 32.8 అడుగులకు పడిపోయింది. ఎగువ ప్రాంత ప్రాజెక్టుల నుంచి తక్కువగానే వరద వసుస్తుండడంతో గోదావరి కూడా మరింత తగ్గే అవకాశముందని అధికారులు భావిస్తున్నారు.

కిన్నెరసాని జలాశయానికి....

పాల్వంచరూరల్: పాల్వంచ మండలంలోని కిన్నెరసాని జలాశయంలోకి వరద కొనసాగుతోంది. 407 అడుగుల నీటి నిల్వ సామర్థ్యం కలిగిన కిన్నెరసాని జలాశయంలోకి 200 క్యూసెక్కుల వరద చేరడంతో శుక్రవారం నీటిమట్టం 405.60 అడుగులకు చేరిందని డ్యామ్‌సైడ్ పర్యవేక్షక ఇంజనీర్ సురేశ్ తెలిపారు. వరద మరింత పెరిగితే గేట్లను ఎత్తనున్నందున లోతట్టు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

దేశం గర్వించదగిన ఇంజనీర్ విశ్వేశ్వరయ్య


విశ్వేశ్వరయ్య జయంతి వేడుకల్లో పాల్గొన్న సింగరేణి డైరెక్టర్లు, అధికారులు

సింగరేణి(కొత్తగూడెం): భారతదేశం గర్వించదగిన ఇంజనీర్, భారతరత్న పురస్కార గ్రహీత మోక్షగుండం విశ్వేశ్వరయ్య అని సింగరేణి డైరెక్టర్లు ఎన్వీకే శ్రీనివాస్, వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట విశ్వేశ్వరయ్య విగ్రహానికి ఆయన జయంతి సందర్భంగా వారు నివాళులర్పించి మాట్లాడారు. బ్రిటీష్ కాలంలోనే ఆయన ఇంజనీర్‌గా అత్యున్నత విజయాలు సాధించారని తెలిపారు. అలాగే, విశ్వేశ్వరయ్య హయాంలో రూపుదిద్దుకున్న ప్రాజెక్టులు ఈనాటికీ నిలిచిపోయాయని చెప్పారు. కార్యక్రమంలో వివిధ విభాగాల అధికారులు కట్టా బసవయ్య, సూర్యనారాయణ, ఎం.సుబ్బారావు, జి.వెంకటరమణ, బీహెచ్ వెంకటేశ్వరరావు, జి.మోహన్‌రెడ్డి, ఎస్.జగన్‌మోహన్‌రావు, జి.కమలాకర్‌భూషణ్, సీహెచ్ నవీన్‌కుమార్, జి.జానకీరామయ్య, జి.నాగేశ్వరరావు, ఎస్.వెంకటేశ్వరరావు, ఎ.రవికుమార్, డి.లలిత్‌కుమార్, రాజశేఖర్, రవికుమార్ పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయానికి రూ.10 లక్షలు విరాళం


ఆలయ నిర్వాహకులతో పుల్లారెడ్డి కుమారులు

తల్లాడ: తల్లాడ మండలం కుర్నవల్లిలోని అయ్యప్ప దేవాలయ నిర్వహణ నిమిత్తం తమ తల్లిదండ్రుల పేరిట కుమారులు రూ.10 లక్షలు విరాళం అందజేశారు. కుర్నవల్లిలో స్థానికులు కమిటీగా ఏర్పడి అయ్యప్ప ఆలయాన్ని నిర్మించారు. ఈనేపథ్యాన ఆలయ నిర్వహణ కోసం గ్రామానికి చెందిన అన్నెం పుల్లారెడ్డి–సీతమ్మ దంపతుల పేరిట వారి కుమారులు అన్నెం నాగిరెడ్డి, కృష్ణారెడ్డి, వెంకటరెడ్డి, సత్యనారాయణరెడ్డి, కోటారెడ్డి శుక్రవారం రూ.10 లక్షలు అందజేశారు. కార్యక్రమంలో అన్నెం వెంకటేశ్వర్‌రెడ్డి, వెంకటరెడ్డి, శాఖంరెడ్డి బుచ్చిరెడ్డి, కర్నాటి రామిరెడ్డి, బోడేపూడి పూర్ణచందర్‌రావు, వేమిరెడ్డి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.